ఆ జంట!

శ్రీ శ్రీనివాసరావు



"ఒరే కోటేశ్వర్రావ్! మన వెనక వస్తున్నారే వాళ్లిద్దర్నీ చూడు చెప్తా!" అని నా ప్రక్కనే నడుస్తున్న నా మిత్రుడు నారాయణ నా చేయిఊపి అన్నాడు. నేను మా ప్రక్కగా వెళ్తున్న ఆ జంటను చూచి చూడనట్లు పరికించాను. మనమీ ప్రపంచంలో సామాన్యంగా చూస్తూంటాము- లావుపాటి యువకునికి నాజూకుగా, సన్నగా ఉండే అమ్మాయి భార్యగావటం! ఒడ్డూ పొడుగూ తగినట్లుగాఉన్న యువకునికి సర్కస్‌క్వీన్‌లా ఒక స్థూలకాయిని అర్థాంగికావటం! చైనాముఖానికి ఊర్వసిలాంటి అమ్మాయి పెండ్లాముగావటం! స్ఫురద్రూపియైనవానికి ఏ కిష్కింధా గ్రహారిణి భార్యామణి కావటం!! అలా కాకుండా నాకీజంట ఎంతో ఆశ్చర్యం - ఉత్సాహం కూర్చింది. ఇద్దరూ సుందరీ నందులలా ఉన్నారు. ఉవ్వెత్తుగా దువ్విన్న ఉంగరాలజుట్టు, మనోహకమయిన ముఖము, లాల్చి, బిళ్లగోచి పంచెకట్టు ఆంధ్ర - బెంగాలీ సమ్మిళిత సంస్కారం ఇట్టే కనుపిస్తుంది. అతనికి దగ్గఱగా - ప్రక్కనే నడుస్తున్న ఆ సుందరి సహజ సౌందర్యాన్ని ఆమె కట్టుకొన్న సన్నని నేతచీరె, మోచేతివరకు చేతులున్న జాకెట్టు, ఆజానువిలంబిత వేణీభరము ప్రస్ఫుటితంగా ప్రకటిస్తున్నాయి.

"ఎవర్రా! వాళ్లిద్దరూ! మనం చదివే ప్రబంధాల్లోని నాయికా నాయకులను మరిపిస్తున్నారు!" అని నేను మా నారాయణతో అన్నాను.

"భారతి, గృహలక్ష్మి, ఆంధ్రప్రభల్లో పడే బొమ్మల్ని చూచి తన్మయుడవు అవుతుంటావే! ఎంత అద్భుతంగా చిత్రించాడురా హృదయ్‌బాబు! అని వకాల్తా పుచ్చుకొని పొగడుతుంటావే! ఇతడే ఆ హృదయ్‌బాబు!!" అన్నాడు నారాయణ.

నా ఆశ్చర్యానికంతులేకపోయింది. ఎంత దివ్యంగా చిత్రించుతాడు! ఒకటి రెండు రేఖల్లోనే ముఖంలోని అంతర్గతంగాఉండే భావాలను విస్పష్టంగాచూపే ప్రతిభాశాలియైన చిత్రకారుడు హృదయ్

బాబు! ఇతడేనా! నమ్మలేకపోయాను. అతడి బుద్ధుడు, రాముడు, శంకరుడు చిత్రాల్లోని సౌందర్యమంతా ప్రత్యక్షంగా తానే పొంది ఉన్నాడే!

ఉత్సాహంతో అన్నాను - "ఆ అమ్మాయి అతడి ..."

"ఆఁ. అతడి ధర్మపత్నేరా!"

నా అఖండోత్సాహం పరిపూర్ణానందంగా మారింది. ఒక సౌందర్యవంతుడయిన కళాకారునికి అన్యాయంచేయకుండా తగిన భార్యను కూర్చినందుకు భగవానునికి ప్రణామాలెంచాను.

నా ఆలోచనను భంగం చేస్తూ, "కోటేశ్వర్రావ్! ఒక్క విశేషం! ఆయనెప్పుడూ కండవాకప్పుకొనే ఉంటాడు. ఎందుకో తెలుసా!" అన్నాడు నారాయణ. వాడిప్రశ్న కొంటెగా - వెఱ్ఱిగా - తోచింది. వీడి బుద్ధి అనరు చదువుతూ బహుసూక్ష్మమవుతున్నట్లు తోస్తుంది.

"నాకు తెలియదుగాని నీవు మాత్రం ఒక ప్రహసనం అల్లకురా!"

"ఏం. నీ అభిమాన చిత్రకారునిపై ఏదో కామెంటు చేస్తున్నాననా, అలుక కలిగింది! పోనీలే!" ఒక చిరునవ్వు వాడి ముఖానికి అందం తెచ్చింది.

మాట్లాడకుండా నేను వాడిప్రక్కనే నడుస్తున్నా. చల్లనిగాలిలో, గంభీర సంద్రతరంగములు మా పాదాలకు దగ్గరగా తీరాన్ని పలుకరించి వెళుతున్నాయి.

ఉన్నట్లుండి వాడిలా అన్నాడు-"సహృదయంతోనే చెపుతా వినరా! హృదయ్ బాబు గొప్ప రూపసి అనీ, చిత్రకారుడనీ నేను ముప్పాతికి ఒప్పుకొంటాను. కాని ఇప్పుడతనిపేరుతో వస్తున్న బొమ్మలు అతడి ప్రక్కనేఉన్న ఆలతాంగే చిత్రించేది. కారణం-అతని కుడిచేయి లేదు!!"

విస్మయం నన్ను పెనవేసికొనిపోయింది. అదొక విచిత్రమయిన గాథలా అనిపించింది. మందహాసంతో నారాయణ యిలా చెప్పసాగాడు.

హృదయ్ బాబుది మాచీరాలే. అతడు చిన్నప్పటినుండి వీథిబడి, హైస్కూలు జీవితంలోనే చిత్రలేఖనంలో వయసుకు మించిన ప్రతిభాకౌశలాన్ని చూపిస్తుండేవాడు. పంతుళ్లు, మిత్రులు అంతా అతడి రమణీయ చిత్రాల్ని గంటల తరబడి చూస్తూ ప్రశంసిస్తుండేవారు. అతనితో పాటు అతని క్లాసుమేటుగా వస్తుంది మా ఊరి హెడ్మాష్టరుగారమ్మాయి రమ. మనోహరమయిన గుణవతి - రూపవతి. ఆమె హృదయ్ చిత్రాలంటే ముగ్ధురాలయ్యేది. హృదయ్ కూడా తన చిత్రాల్లో ఆమె ప్రతిబింబాల్నే చిత్రిస్తుండేవాడు. నిజానికి అతడి హృదయంలో ఆమె కెంతో చోటు ఏర్పడింది. అటు ఆమె స్థితి అలాగే

అయింది. సహృదయుడయిన హెడ్మాష్టరుగారు వారిద్దరి వినిర్మల స్నేహాన్ని చూచి మనఃపూర్వకంగా వారిద్దరికీ ఉద్వాహంచేశాడు. గ్రామం అంతా ఆ జంటను ప్రేమతో దీవించింది.

నాలుగేళ్లు దొర్లిపోయినయి.

రమ చెల్లెలు, ఉమ హృదయ్ అంటే పడిచస్తుంది. ఎప్పుడూ హృదయ్‌ను బావా! బావా! అంటూ వెంట ఉండేది. ఆమె కిప్పుడు పదిహేనేళ్లు వచ్చినయి. పెద్దదైనప్పటికీ తన ప్రియమైన బావను బావా యని నోరార పిలవటానికి జంకు - గొంకు లేదామెకు. హృదయ్ వేసే బొమ్మల నన్నిటినీ రెప్పవాల్పకుండా చూస్తుండేది. తానూ బొమ్మలు గీయటం ప్రారంభించింది. ఆమె చిత్రకళా పిపాస, ప్రేమ ఆమెను ఆకళలో సమర్థురాలను చేసినయి. తన చిత్రాలచేత హృదయ్ మెప్పును, శిక్షణను పొందింది.

ఒకసారి అది ప్రక్కింటివారి పెండ్లి సందర్భం. హృదయ్ అప్పుడు జ్వరంచేత మంచంలోనే ఉండిపోయాడు. పెండ్లిపనులతో రమ ఉమను బావకు మందు, సేవలు చూడమని చెప్పింది. ఇరవైనాలుగు గంటలు ఉమ హృదయ్ దగ్గరే కూర్చొని అతనికి సపర్యచేసింది.

తల దగ్గరగాకూర్చొని హృదయ్ ఉంగరాలజుట్టులో తన కోమలమయిన వ్రేళ్ళను జొనిపి నిమురుతూ, అమాయకంగా ప్రశ్నించింది. - "బావా! ఈ ఉంగరాల జుట్టు నీ కెలా వచ్చింది?"

హృదయ్ చిరునగవుతో, "నేను చెప్పను!" అన్నాడు.

"చెప్పవా బావా!"

మరి కొంచెము సేపు తర్వాత, "నీ కళ్లు చాలా అందమయినవి బావా! నీ ముక్కు, గడ్డము బొమ్మ వేయడానికి తగినయి బావా!" అని ఉమ అమాయకంగా అన్నది.

ఆమె అమాయకత్వానికి హృదయ్ ఎంతో మురిసిపోయాడు. బయట పెళ్లి మేళాలు వినపడ్డయి. అతడు మెల్లగా అన్నాడు - "నీవు పెళ్ళెప్పుడు చేసుకుంటావు ఉమా"

"పో, బావా!"

"లేదు ఉమా.. నీకు, నీ బొమ్మలకు తగినవాడే దొరుకుతాడు!"

"ఉహుం. నేను పెళ్లిచేసుకోను. మా అక్కతో చెపుతానుండు!" అని ఆమె చెంగున క్రిందకు వెళ్లింది.

ఉమ కెక్కడో భర్త ఉన్నాడని ఊహించాడు హృదయ్!

ఇటు రమ సంగతి ఆమెకు తెలుసు - చెల్లెలు - ఉమ హృదయ్‌ను ఎంత

ప్రేమాభిమానాలతో చూస్తుందో, హృదయ్‌తో ఆమె అతిసన్నిహితంగా మెలగటం-పరిహాసాలాడటం రమలో ఏకల్లోలాన్ని రేకెత్తింపలేదు. స్ఫురద్రూపి, అందులో కళాకారుడు అయిన పురుషునిపై ఏ జవ్వని తన లేనవ్వులను చిలకరింపదు! తన పతిని అట్లా ఆకర్షించుతున్నపుడు ఏ సతి మౌనంగా ఉంటుంది! రమకు హృదయ్ మనసు బాగా తెలుసు-అతనిలో తానెంత లీనమయిపోయిందోనని

ఆ యేటి వసంతకాలములో రమా, ఉమా, హృదయ్‌లు నాగార్జున కొండకు పూర్వాంధ్రశిల్పులు చెక్కిన శిల్పాలు చూడ్డానికి వెళ్లారు. హృదయ్ ప్రమోదోత్సాహాలతో రమా ఉమలకు ఆ బౌద్ధారామాల శిల్పాలను చూపించి చరిత్రను వివరించాడు. నిర్జీవమయిన ఆ పాషాణాల్లో మానవమాత్రుడయిన శిల్పి భావుక హృదయాలను స్పందింపజేసే మానవరూపాలను మలచి జగత్ శిల్పితో బాంధవ్యము కూర్చుకొంటాడుగదా! అన్ని శిల్పాలు ఎవరికోసం చెక్కారో ఇల్లూ వాకిల్లూ లేకుండా యీసుదూర పర్వతగుహల్లో కేవల శిల్పంతోనే జీవించినట్లుంది ఆ శిల్పులు! ఈ భావాలతో ఆ ముగ్గురూ ఆ ప్రశాంత గంభీర ప్రకృతినిలయంలో విహరించారు.

రెండవరోజున మా చీరాలకు పిడుగు లాంటివార్త వచ్చింది - రమా ఉమా హృదయ్‌లు ప్రయాణంచేస్తున్న కారుకు ప్రమాదం సంభవించిందని! హెడ్మాస్టరు గారు వికలహృదయంలో నాగార్జున కొండకుబయులుదేరారు. ఆ రాత్రి రమా ఉమా హృదయ్‌లు యింటికి తేబడ్డారు.

హృదయ్‌కు కుడిచేతికి పూర్తిగా బలమయిన గాయాలు తగిలి విరిగిపోయింది. రమకు ముఖంలో చాల గాజుపెంకులు గ్రుచ్చుకొనిపోయి, ఇంకా చాలా గాయాలు తగిలి మంచంలోనే ఉండిపోయింది. ఉమకు స్వల్పమయిన గాయాలయినందున త్వరలో స్వస్థకు వచ్చింది. పూర్తిగా నుజ్జయిపోయినందున హృదయ్ కుడిచేయి ఆపరేషనుచేసి తీసివేశారు డాక్టర్లు. అటు రమ చావు బ్రతుకుల మధ్య ఉండిపోయింది. ఉమ వారిద్దరి మంచాలదగ్గరే అహోరాత్రాలు కనుమూయకుండా వారికి పరిచర్య చేస్తూండిపోయింది.

రమ వికలాంగుడయిన హృదయ్‌ను చూసికొని చాలా విలపించింది. ప్రతివాని హృదయాన్ని కదిలించే బొమ్మలనన్నిటినో చిత్రించిన అతని కళాహస్తం - ఇప్పుడు లేదు. తన్ను బొమ్మగీయడానికి స్టూలుమీద కూర్చోబెట్టి - సరిగా ముఖాన్ని పెట్టలేక పోగా ఆ కళాహస్తం ఆమె గడ్డందగ్గరకు

వచ్చి కొద్దిగా అటు - ఇటు త్రిప్పి ఊచేది! ఎప్పుడూ తన చేతిని ప్రేమగా స్పృశించుతూండే ఆ ప్రేమపూరితహస్తం యిప్పుడు లేదు.

మొండిచేయి వాడయిన హృదయ్‌ను చూచి రమ గుండె కొట్టుకొనేది. ఆమె స్థితికూడా నీరసమయి పోయింది. ఇక యీ ప్రపంచంలో తన కెంతో కాలం చోటు లేదని గ్రహించింది. విచారవదనంతో, దుఃఖాకుల హృదయంతో పరిచర్యలు చేస్తున్న ఉమను దగ్గరకు పిలచి తన - వికలాంగుడయిన హృదయ్‌బావను ప్రేమిస్తున్నావా అని అడిగింది.

ఉమ పిచ్చిగా రమకేసి చూసింది. ఆమె వినీలనయనాలు ధూసరితంగా ఉన్నాయి. ఆమె పరిస్థిని అర్థంచేసికొని రమ "ఉమా! మీ బావను పెళ్లి చేసుకొంటావా!" అని అడిగింది.

ఉమ నేత్రాల్లో తృప్తి, మమత తొణికిసలాడినయి.

ఆ రాత్రి-కాలగర్భంలో ఎన్ని రాత్రులు లీనమయిపోయినవో. ఇంకెన్ని రాత్రులు లీనంకావల్సి ఉన్నవో! ఇలకోళ్లు, తీతు పిట్టలు అరుస్తున్నయి. ఉద్విగ్నంగా ఉన్న హృదయ్‌తో రమ ఇలా అన్నది "బాబూజీ! నాకొక పెద్దకోర్కె ఉంది. తీరుస్తారా!"

భావోద్రేకంతో హృదయ్ రమవైపు చూసాడు-"చెప్పురమా! నీకేమి కావలిసినాసరే తప్పక తీరుస్తాను!"

"ఏమీలేదు. నేను బ్రతికే ఆశలేదు మీరు మీఅమాయక మఱదల్ని ఉమను వివాహం చేసికోండి. అది మిమ్మల్ని తప్ప ఎవర్ని పెళ్లాడదు!"

హృదయ్ హృదయం ఉల్లోలితమయింది. "ఏమిటి రమా! ఈ మాటలు!"

"ఏమీలేదు. మీరు నాయీ తుది కోర్కను పూర్తిచేస్తామన్నారు. నాకేమీకొరతలేదు. ఉమను నన్నుచూసుకున్నట్లే చూడండి!"

రమ యీ పాడులోకాన్ని వదలి వెళ్లింది. హెడ్‌మాష్టరుగారు రమ తుది కోర్కను మనఃపూర్వకంగా క్రియారూపంలో పెట్టాడు. ఉమాహృదయుల పెళ్లయింది. వారే యీ జంట! — అని మా నారాయణ ఆ విచిత్ర చిత్రకారుల కథను ముగించాడు. ఆకథనంలోంచి నా మనసు బయటపడింది. చీకట్లు మమ్మల్నిద్దర్ని హాస్టలువైపు నడిపించినయి.